క్లుప్తంగా

మావుళ్లమ్మకు గజమాల సమర్పణ


గజమాల అలంకరణలో మావుళ్లమ్మ తల్లి

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్లమ్మ అమ్మ వారికి సోమవారం ఆకివీడు శ్రీలక్ష్మీ గణపతి పండ్లు, పూల వర్తక సంక్షేమ సంఘం వారు 140 కేజీల గజమాల సమర్పించారు. ఈసందర్భంగా అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు చిన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు షేక్ బాజ్జీ, గౌరవ అధ్యక్షుడు కొండ శ్రీను, ఉపాధ్యక్షుడు గంటా నాని పాల్గొన్నారు.

ఆర్బీకేలో పోలీస్ స్టేషన్ ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డిప్యూటీ స్పీకర్, ఎస్పీ, ఏపీఐఐసీ చైర్మన్ తదితరులు

కాళ్ల : మండలంలోని కాళ్లకూరులో గల రైతు భరోసా కేంద్రాన్ని పోలీస్‌స్టేషన్‌గా మార్చారు. సోమవారం ఈ భవనాన్ని కలెక్టర్ నాగరాణి, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎస్పీ నయీం అస్మి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజుతో కలసి ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ భీమారావు, డీఎస్పీ జయసూర్య, ఎంపీడీఓ జి.స్వాతి, గ్రామ సర్పంచ్ సాదు శ్రీదేవి, సీఐలు జగదీశ్వరరావు, ఎం.నాగరాజు, కాశీ చరణ్, ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరుపాడులో లేగ దూడల అందాల పోటీలు


రైతుకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

కాళ్ల: ఏలూరుపాడు గ్రామంలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో లేగ దూడల అందాల పోటీలు, పశు ఆరోగ్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ పోటీలో మొదటి బహుమతి చిన్నపరపు సత్తిబాబు, రెండవ బహుమతి సుదాబత్తుల పరశురాముడు, మూడవ బహుమతి మంతెన వెంకట రవి వర్మకి అందజేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీ జి మల్లేశ్వరరావు మాట్లాడుతూ పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు, ఎంపీటీసీ చిన్నపరపు రాంబాబు, మంతెన అంజనేయరాజు, ఎం.రవివర్మ, డి.బాపిరాజు, వి.హరిబాబు, ఏడీ డా.జి. మల్లేశ్వరరావు, డా.చంద్రబాబు, పశుసంవర్ధక శాఖ సహాయకులు వి.సురేష్, పి. చందు, జి.దేవి తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల నిరాహార దీక్షలు


నిరాహార దీక్షలు చేస్తున్న వీవోఏలు

భీమవరం: మూడేళ్లు పూర్తయిన వీవోఏలను తొలగించేలా ప్రభుత్వం ఇచ్చిన కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న జీతాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విస్సాకోడేరు వంతెన వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. దీక్షలను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ డి కళ్యాణి ప్రారంభించారు. అనంతరం గోపాలన్, కళ్యాణి మాట్లాడుతూ ప్రభుత్వం వీవోఏల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి లక్ష్మి, మంగతాయారు, విజయ, శిరీష, నాగమణి, రేవతి, శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

ఉండి: ప్రేమ పేరుతో యువతిని మోసగించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉండి మండలం కోలమూరుకు చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన ప్రశాంత్ ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. అనంతరం ఆమెకు ముఖం చాటేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై నసీరుల్లా తెలిపారు.

కొణితివాడ హైస్కూల్లో ప్రేరణ

వీరవాసరం: కొణితివాడ హైస్కూల్‌లో సోమవారం బంగారుతల్లి ఫౌండేషన్ వారి ప్రేరణ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు మండ రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. చదువు ప్రాధాన్యత, లక్ష్యం ఎలా సాధించాలి, పెద్దలను, గురువులను ఎందుకు గౌరవించాలి వంటి అంశాలపై మోటివేషన్ స్పీకర్ నాగశ్రీ విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రేరణ టీం ప్రతినిధి నాగశ్రీని సత్కరించారు.

చిన్న క్యారీ బ్యాగ్.. పెద్ద తప్పే

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- పర్యావరణానికి తీవ్ర హాని వాటిల్లుతుందని నిపుణుల ఆవేదన
- ప్లాస్టిక్ రహిత సమాజానికి ముందడుగు వేయాలంటున్న అధికారులు


వీరవాసరం పాత సినిమా హాలు రోడ్డులో వాడి పడేసిన పాలిథీన్ కవర్లు

పాలకోడేరు: ఓ చిన్న క్యారీ బ్యాగ్ లేకుండా సాధారణ జీవితం గడవని పరిస్థితి. సరుకులు, కూరగాయల కోసం.. పాలు, పండ్లు, మాంసాహారాలు, దుస్తులు ఇలా దేనికైనా క్యారీ బ్యాగ్ ఉండాల్సిందే. మన జీవితంలో అంతర్భాగమైనా క్యారీ బ్యాగ్ సమస్త ప్రాణకోటికి ముప్పు తెచ్చి పెడుతుందని ఎవరూ ఊహించి ఉండరు. నిత్యం పాలిథీన్ కవర్లు, ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణానికి తీవ్ర హాని కలగడంతోపాటు ఎన్నో పశువులు మృతి చెందుతున్నాయి. ఇవన్నీ మనకు తెలిసినా ఏం పర్లేదులే ఒక్క కవరే కదా అనే నిర్లక్ష్యమే ఇంతవరకు తెచ్చింది. ఇది సమస్త జీవ జాలానికి ప్లాస్టిక్ పెనుముప్పుగా పరిణమించింది. ఈ ప్లాస్టిక్ వల్ల సముద్ర జలాలు, నదీ జలాలు, పంట కాలువలు, డ్రెయిన్లు కూడా కలుషితమవుతున్నాయని, ఫలితంగా సమస్త ప్రాణకోటి మనుగడకు తీవ్ర విఘాతం కలుగుతోందని పర్యావరణ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని అధికారులు పదే పదే కోరుతున్నారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్లాస్టిక్‌పై నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నారు.

నిషేధాజ్ఞలు ఎప్పటినుంచో ఉన్నా..

పర్యావరణానికి అత్యంత హాని కలిగించే ప్లాస్టిక్‌పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిషేధాజ్ఞలు ఎప్పటినుంచో అమలులో ఉన్నా వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ఉండి, భీమవరంలోని పట్టణాలు, గ్రామాల్లో ఎటు చూసినా పాలిథిన్ కవర్ల వినియోగమే ఇందుకు నిదర్శనం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినప్పుడు హడావిడి చేసే అధికారులు ఆపై పట్టించుకోకపోవడం ప్లాస్టిక్ అధిక వినియోగానికి కారణమైంది. ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసిన వేడి ఆహార పదార్థాలను తీసుకువెళ్లడం, ప్లాస్టిక్ కప్పుల్లో టీ కాఫీ లను తీసుకోవడం ద్వారా శ్వాస కోశ కేన్సర్ వంటి ప్రాణాంతక రోగాలను ప్రజలు కొని తెచ్చుకుంటున్నారు. గత ఏడాది120 మైక్రాన్ల మందం ఉన్న ప్లాస్టిక్ సంచులకే ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అంతకన్నా తక్కువ మందం ఉన్న సంచుల క్రయవిక్రయాలపై భారీ జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చేపడతామని హెచ్చరించింది. ఈ మేరకు మున్సిపాలిటి, గ్రామాల్లో అధికారులు దాడులు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానాలు విధించారు. ఇదంతా మూన్నాళ్ళ ముచ్చటగా మారింది. మూడు నెలలు తిరిగే సరికి మళ్లీ షరామామూలే అంటూ ప్రతి షాపులోను నిషేధిత కవర్లు కనిపిస్తున్నాయి. ఫలితంగా కాలువలు చెత్తకుప్పల్లో వాడిపడేసిన పాలిథిన్ కవర్లు పేరుకుపోతున్నాయి. ఈ వ్యర్థాలను మూగజీవులు తిని కడుపులో జీర్ణంకాక మృత్యువాత పడుతున్నాయి. రోజురోజుకు పెరిగిపోతున్న ప్లాస్టిక్ వినియోగం మానవాళికి ప్రమాదకరంగా మారి పెద్ద ప్రళయాన్నే సృష్టిస్తుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నా.. ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకొస్తున్నా.. వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయలేకపోవడం.. ప్రజలు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. ఇకనైనా అందరూ కలిసి కట్టుగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం విడిచిపెట్టి గుడ్డ సంచులను వినియోగిస్తూ, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.


దుకాణాల వద్ద పాలిథీన్ కవర్ వినియోగిస్తున్న దృశ్యం


పాలకోడేరులో పాలిథీన్ కవర్‌తో సరుకులు తీసుకువెళ్తున్న దృశ్యం

ప్లాస్టిక్స్ వదిలితేనే ఆరోగ్యం



ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసిన ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా విషవాయువులు శరీరంలోకి చేరతాయి. ఫలితంగా గ్యాస్ట్రిక్ శ్వాసకోశ సమస్యలతో పాటు కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను తిన్న ఆవులు, బర్రెలు మృత్యువాత పడుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా వదిలేస్తేనే ఆరోగ్యానికి మంచిది.

– చినమిల్లి రంగమనాయుడు, పీహెచ్‌సీ వైద్యాధికారి, పాలకోడేరు

ప్రజలు సహకరించాలి



గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నాం. ఇటీవలే మా సిబ్బంది మండలంలోని అన్ని గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించారు ఇంకా అక్కడక్కడ నిషేధిత ప్లాస్టిక్ వినియోగం జరుగుతోందని తెలుస్తుంది. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాల అమలులో భాగంగా ప్రజలు సైతం స్వచ్ఛందంగా ప్లాస్టిక్ రహిత సంచులు వినియోగిస్తూ సహకరించాలి.

– వి రెడ్డియ్య, ఎంపీడీవో పాలకోడేరు

ఉప్పులూరులో విషాదఛాయలు

- పొట్టచేతపట్టుకుని వెళ్లి.. తిరిగిరాని లోకాలకు
- రోడ్డు ప్రమాదంలో ఒకే ఇంట్లో ఇద్దరు మృతి, ప్రాణాపాయంలో మరొకరు

ఉండి: దెందులూరు జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం ఉండి మండలం ఉప్పులూరు గ్రామంలో విషాద ఛాయలు మిగిల్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పులూరు గ్రామం నుంచి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు డొల్లా జోషిబాబు (39), బోడా చందూ(20), ఈలి సన్నీ అనే ముగ్గురు వ్యక్తులు సుమారు 12 రోజుల క్రితం గుంటూరులో వరిసాగు దుక్కులకు వెళ్లారు. వీరితో పాటు ఇంకొందరు మరో నాలుగు ట్రాక్టర్లలో ఉప్పులూరు నుంచి గుంటూరుకు వెళ్లారు. పని ముగించుకుని బయలుదేరి వస్తున్న సమయంలో దెందులూరులో టీ కోసం ఆగారు. టీ తాగిన అనంతరం ట్రాక్టర్లలో ఒకరి తరువాత మరొకరు బయలుదేరారు. అయితే మిగిలిన ట్రాక్టర్లు వెనుకాల నిమిషాల వ్యవధిలో జోషిబాబు తన ట్రాక్టరుతో బయలు దేరాడు. సరిగ్గా దెందులూరు మండలం కొమిరేపల్లి, సత్యనారాయణపురం మధ్యలోకి రాగానే వెనకనుంచి కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జోషిబాబు, చందూ మృతి చెందగా ఈలి సన్నీకి తీవ్ర గాయాలయ్యాయి. జోషిబాబుకు భార్య లలితకుమారి, ఇద్దరు ఆడపిల్లలు వున్నారు. ఒక కుమార్తెకు మూడు నెలల క్రితమే వివాహం కాగా మరో కుమార్తె పదోతరగతి చదువుతుంది. మరో మృతుడు బోడా చందూకి వివాహం కాలేదు. తండ్రి జోషిబాబు వ్యవసాయకూలీ, తల్లి గల్ఫ్ దేశంలో ఉంది. అతనికి చెల్లులు ఉంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఈలి సన్ని మృతుడు జోషిబాబు అల్లుడు. ఇతనికి ఇటీవలే మూడు నెలల క్రితం వివాహమైంది. ప్రస్తుతం ఇతడు ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నాడు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఒకుసారి చనిపోవడం, మరో వ్యక్తి ప్రాణాపాయంతో ఆసుపత్రిలో ఉండడంతో ఉప్పులూరులో విషాధం అలుముకుంది. పోస్టుమార్టం ఆలస్యం కావడంతో సోమవారం రాత్రికి కూడా మృతదేహాలను అప్పగించలేదు. మృతుడు చందూ తల్లి హుటాహుటిన గల్ఫ్‌దేశం నుంచి కొడుకును కడసారి చూసేందుకు బయలుదేరినట్లు సమాచారం.

ఉన్నత భవిష్యత్‌కు విద్య ఒక్కటే మార్గం


చెరుకువాడలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: ప్రతి విద్యార్థిలోను ఓ మేధావి దాగి ఉన్నాడని రిటైర్డ్ ప్రొఫెసర్ కేవీ సుబ్బరాజు అన్నారు. సోమవారం ఉండి, చెరుకువాడ జెడ్పీ హైస్కూళ్లలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు, కలిగొట్ల గోపాలశర్మ మాట్లాడుతూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే విద్యార్థి దశలోనే పునాదులు వేసుకోవాలన్నారు. చదువుకునే విషయంలో ప్రణాళిక చాలా ముఖ్యమని అన్నారు. భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు విద్య ఒక్కటే మార్గమని అన్నారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు మొమెంటోలు, ప్రశంసాపత్రాలు, బుక్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో శాఖ మండల కార్యదర్శి గాదిరాజు రంగరాజు, కోచైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు, శాఖ జిల్లా సభ్యుడు వెంకటపతిరాజు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

143 మందికి కంటి వైద్యసేవలు


చెరుకువాడలో నిర్వహిస్తున్న నేత్రవైద్య శిబిరంలో పాల్గొన్న సర్పంచ్ సాంబశివరావు, వైద్యులు

ఉండి: చెరుకువాడ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ కొండవేటి సాంబశివరావు సౌజన్యంతో సోమవారం ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఐడియల్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో సుమారు 143 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ సూర్యసామిత్ మాట్లాడుతూ కంటికి ఏ సమస్య వచ్చినా సొంతవైద్యం చేసుకోకుండా తప్పకుండా వైద్యులను సంప్రదించాలని అన్నారు. ఆకివీడు లయన్స్‌క్లబ్ నాయకురాలు మోరా జ్యోతిరెడ్డి, డాక్టర్ పెన్మత్స భాస్కరరాజు, పెన్మత్స కృష్ణచైతన్య, దాసరి సనాతన, యిర్రింకి సత్యనారాయణ, బుజ్జీ, కొండవేటి నాగవెంకసత్యనారాయణ, పెన్మత్స హిమాద్రిరాజు, కుచ్చు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు తొలగించవద్దని కలెక్టర్‌కు వినతి


కలెక్టరేట్‌కు వచ్చిన పాలకోడేరు ఏఎస్‌నగర్ ఇళ్లు బాధితులు

భీమవరం(ప్రకాశం చౌక్): పాలకోడేరు శివారు ఏఎస్‌నగర్‌లోని పంట కాలువ సమీప అనుకుని దాదాపు 60 ఏళ్లకు పైగానే 130 కుటుంబాలు ఉంటున్నాయి. అయితే ఆ ఇళ్లు తొలగించాలని అధికారులు నోటీసులు జారీ చేయడంతో బాధితులు సోమవారం కలెక్టరేట్‌కు ట్రాక్టర్లలో పెద్ద సంఖ్యలో వచ్చి కలెక్టర్ నాగరాణిని కలిశారు. తాము చాలా ఏళ్లుగా అక్కడ ఉంటున్నామని ఇళ్లు తొలగిస్తే పిల్లలతో, వృద్ధులతో తామంతా తీవ్ర ఇబ్బందులు పడతామని వాపోయారు. ఇళ్ల తొలగింపు చర్యలు నిలుపుదల చేసి న్యాయం చేయాలని కోరారు.

సీఎస్ఆర్ ఫండ్స్ రూ.25 లక్షలు అందజేత


కలెక్టర్ నాగరాణికి చెక్కు అందజేస్తున్న వెల్‌కమ్ ఫిషరీష్ అధినేత కె.సాదాలతీఫా

భీమవరం (ప్రకాశం చౌక్): ఉండి మండలం వాండ్రం గ్రామంలోని వెల్‌కమ్ ఫిషరీష్ లిమిటెడ్ అధినేత కె.సాదాలతీఫా తన తండ్రి కె.ఆనంద్‌తో కలిసి సీఎస్ఆర్ ఫండ్స్ రూ.25 లక్షల చెక్కును సోమవారం కలెక్టర్ చదలవాడ నాగరాణికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధిలో వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని అన్నారు. ముఖ్యంగా పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ నిబంధనల మేరకు సీఎస్ఆర్ ఫండ్స్ రెండు శాతం నిధులను జిల్లా యంత్రాంగానికి అందజేయాలన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్


పెదఅమిరంలో కార్యకర్తల సమక్షంలో పీవీఎల్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

కాళ్ల: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు, నేతలకు అండగా ఉంటామని, ఎవరూ భయపడాల్సిన పనిలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు భరోసా ఇచ్చారు. పెదఅమీరంలోని పార్టీ కార్యాలయంలో సోమ వారం ఆయన పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ పీవీఎల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పీవీఎల్, కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలల్లోనే వారి పాలనపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. ఇచ్చిన హామీలు పక్కనపెట్టి సొంత లాభాల కోసం పనిచేస్తున్న కూటమినేతల తీరును ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే తగినరీతిలో గుణపాఠం చెబుతారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలంతా మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కడతారని, జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెన్మత్స దుర్గా ప్రసాదరాజు, సాగిరాజు హరివర్మ, వేగేశ్న జయరామ కృష్ణంరాజు, కొత్తపల్లి రమేష్ రాజు, ఆకివీడు జడ్పీటీసీలు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వేగేశ్న వెంకటరాజు, ఎంపీపీ కటారి జయలక్ష్మి, భూపతి రాజు చంటిరాజు, ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, మండల కన్వీనర్లు గణేశ్న రాంబాబు, పెన్మత్స ఆంజనేయరాజు, కటిక శ్రీదేవి, గులిపల్లి అచ్చారావు, వీరమల్లు బోసు, మన్నె నాగరాజు, సుంకర భోగేశ్వరరావు, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎంఈవోలకు సత్కారం


ఉత్తమ ఎంఈవో అవార్డులందుకున్న శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యారంగంలో ఉత్తమసేవలందించి కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అవార్డులందుకున్న భీమవరం మండల విద్యాశాఖాధికారులు ఎస్ శ్రీనివాసరావు, వేంద్ర వెంకటేశ్వరరావులను సోమవారం మండల, పట్టణ ఉపాధ్యాయులు భీమవరం లూథరన్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు, కె.సాయిరాం, సీహెచ్ రాఘవ ప్రసాద్, ఎస్ శ్రీసూర్య భగవాన్‌రాజు, వి విశ్వనాథరాజు, ఎ రామకోటేశ్వరరావు, కోడె వెంకట్రావు, రేపాక వెంకన్న బాబు పాల్గొన్నారు.

పేదలకు కుట్టుమెషీన్ల పంపిణీ

భీమవరం: పేద మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఎదగాలనే సంకల్పంతో రాజ్‌ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం పట్టణం గునుపూడిలో రాజ్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మహిళలకు సోమవారం ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు గంటా రాజ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, ఆనంద్, నల్లం చిట్టిబాబు, రెడ్డి సత్తిబాబు, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 3 ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం మూడు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్ తెలిపారు. స్థానిక సాలిపేటలో ఆక్రమణల్ని తొలగించాలని గతంలో అనేక అర్జీలు పెట్టినా స్పందించలేదని, తక్షణం చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతానికి చెందిన శలా కోట నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారన్నారు. అలాగే స్థానిక అమృతరావు కాలనీ సమీపంలోని బాబూ జగజ్జీవనరామ్ కాలనీవాసులు కనీస వసతులు లేక ఇబ్బంది పడుతున్నామని, మరుగుదొడ్లు, స్నానాలు చేసేందుకు బరకాలు అడ్డుపెట్టుకోవలసి వస్తుందని మహిళలు ఆవేదన చెందుతున్నారని ఆ ప్రాంతానికి చెందిన ఎం.సతీష్‌కుమార్ ఫిర్యాదు చేశారన్నారు. ఆన్‌లైన్‌లో తన భూమి పూర్తి స్థాయిలో నమోదు కాలేదని మల్లారెడ్డి సుధాకరరావు ఫిర్యాదు చేసినట్లు శ్రీకర్ వివరించారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పాలకోడేరు: విస్సాకోడేరులో మండల పశు వైద్యాధికారి డాక్టర్ టి.హేమ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ బొల్ల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు కలిగిన రైతులందరూ ఈ ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ 69 పశువులకు, 20 దూడలకు, 25 మేకలకు నట్టల నివారణ మందులు వేశామని, అలాగే 400 కోళ్లకు టీకాలు వేసినట్లు తెలిపారు. గాదల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి హాని


ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం: అనేక అనర్థాలకు కారణమైన ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని తహసీల్దార్ రావి రాంబాబు తెలిపారు. సోమవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయానికి స్టీల్ గ్లాస్, ఫ్లాస్కో, స్టీల్ కప్పులు, ప్లేట్లు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాంబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతుందన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ వాడకం నిషేదించాలనే నిర్ణయం మేరకు ముందుగా ప్రభుత్వ కార్యాలయాల నుంచే ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నామన్నారు. అన్ని కార్యాలయాల్లో ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా స్టీల్ వస్తువులను వినియోగించాలన్నారు. నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, డిప్యూటీ తహసీల్దార్ ఈ నాగార్జున, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం నాగభూషణరావు, సీనియర్ అసిస్టెంట్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ ఎలక్ట్రీషియన్స్ డే


థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సోమవారం నేషనల్ ఎలక్ట్రిషన్ డే వేడుకలు నిర్వహించారు. ముందుగా విద్యుత్ బల్బును కనుగొన్న శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మెంటే పార్థసారథి మాట్లాడుతూ మానవాళికి వెలుగును చూపించిన శాస్త్రవేత్త థామస్ ఆల్వా ఎడిసన్‌ను స్మరించుకోవడం మన బాధ్యతని అన్నారు. ఎలక్ట్రీషన్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అంబళ్ళ శ్రీనివాసరావు, కింతాడ కృష్ణమోహన్ మాట్లాడుతూ వృద్ధాప్యానికి చేరుకున్న సీనియర్ ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లను ఆదుకుంటామని తెలిపారు. జిల్లా లేబర్ అసిస్టెంట్ కమిషనర్ టీవీవీ ఆదినారాయణమూర్తి, లేబర్ ఆఫీసర్ ఎం కిరణ్‌కుమార్ కార్మికుల చట్టంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గొట్టుముక్కల కృష్ణంరాజు, అల్లు శ్రీనివాస్, కట్టా శ్రీనివాస్‌గౌడ్, దొడ్డిపట్ల అమ్మారావు, కడలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాలు ప్రారంభం


గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని శ్రీరాంపురం గాంధీ కస్తూరిబా మహిళ కేంద్రంలో సోమవారం జిల్లా సర్వోదయ మండలి, శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమవరం మావుళ్ళమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన ఆనంద్ వర్మ, ఆర్అండ్‌డీ డీఈ కుమార్ మాట్లాడుతూ అహింస ఆయుధంగా గాంధీజీ చేసిన పోరాటం, సాధించిన స్వాతంత్ర్యాన్ని మనమంతా ప్రచారం చేసినపుడే నేటి తరానికి అటువంటి కార్యక్రమాల పట్ల అవగాహన ఏర్పడుతుందని అన్నారు. జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా ప్రతి పాఠశాల, కళాశాలలో గాంధీజీ ఆశయాలపై వ్యాసరచన, ప్లాస్టిక్ నిషేధంపై చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తామన్నారు. 30న క్విట్ ఇండియా స్థూపం వద్ద వర్ధంతి ముగింపు, విజేతలకు బహుమతులు, గాంధీ వాదులకు సత్కారాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీతారామరాజు, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆకివీడు: స్థానిక 220 కేవీ, 33 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలోని అని విద్యుత్ ఫీడర్లలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు డీఈఈ ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకివీడు, కుప్పనపూడి, గుమ్ములూరు రోడ్డు సబ్ స్టేషన్ల పరిధిలోని 11 కేవీ ఫీడర్స్ నిలుపుదల చేస్తున్నామన్నారు. దీనివల్ల పట్టణంలోని ఇండస్ట్రీయల్‌ఏ రియా, దుంపగడప, అజ్జమూరు, అయిభీమవరం, ఫీడర్స్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. చేపల చెరువులు, పరిశ్రమదారులు, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రకటన

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ భీమవరం బ్రాంచి వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం మార్టగేజ్ చేయదలిచిన ఆస్తిని తేజస్విని తండ్రి గంగాధరరావు అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన నాటి నుండి 7 రోజులలో తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. భీమవరం సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం. 187/2010 పేజినామా 10 of BK No. 3/2010 భీమవరం పట్టణం 30వ వార్డు ఆర్.యస్.నం. 493, 494/2,3, 495/7 లలో ప్లాట్ నం.16కు చెందిన 387చ.గ. ఇందులో నిర్మించిన డాబా భవనంకు హద్దులు:తూర్పు రోడ్డు, పడమర ప్లాట్ నం.13, ఉత్తరం ప్లాటు నం.15 దక్షిణం ప్లాటు నం.17

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం.బి.ఎల్.
అడ్వకేటు,పాలకొల్లు,సెల్ : 9490433732